క్లుప్తంగా

ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ నూతన కమిటీ

కడప కల్చరల్ : దేవుని కడపలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయ నూతన పాలక మండలి బుధవారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేసింది. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్‌ల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఈ నియామకం జరిగింది. నూతన పాలక మండలి సభ్యులు తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా పి.పద్మాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు పిచ్చయ్య మూరి, ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఒంటేరు గంగయ్య, లక్ష్మీకాంతమ్మ, కల్పన, రమణా రెడ్డి, నీలావతి వివిధ రిజర్వేషన్ల మేరకు ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా పద్మాకర్ 2020–21 నుంచి రెండేళ్లపాటు ఇదే ఆలయంలో సేవలు అందించారు. తిరిగి మరోమారు చైర్మన్‌గా ఆయనకు రెండు సంవత్సరాల పదవీకాలంలో అవకాశం లభించింది.

హుండీ సొమ్ము లెక్కింపు

కడప కల్చరల్ : కడప నగరం మృత్యుంజయ కుంటలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. దేవాదాయశాఖ కడప ఇన్‌స్పెక్టర్ ఎస్.జనార్దన్ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 2023 డిసెంబరు 14 నుంచి ఇప్పటి వరకు హుండీల ద్వారా రూ. 69,426 లభించింది. మహాశివరాత్రి సేవా టిక్కెట్ల ద్వారా రూ. 26,745, తాత్కాలిక హుండీ ద్వారా రూ. 24,034, చదివింపుల ద్వారా రూ. 2300 లభించింది.

సీఏఏ రాజ్యాంగ విరుద్ధం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బీజేపీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం సీఏఏ అమలు చేయరాదని ఎస్‌ఆర్‌సీ జెఏసీ కన్వీనర్ అహ్మద్ బాబు భాయ్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని అజ్మత్ షాదీఖానాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఏఏ అనేది రాజ్యాంగ విరుద్ధమని, వీటిని వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ మేరకు త్వరలో నగరంలో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ న్యాయవాది మహమ్మద్ అలీ ఖాన్, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, న్యాయవాది సంపత్ కుమార్, డాక్టర్ ఓబుల్ రెడ్డి, డాక్టర్ ఫారుక్, మల్లెల భాస్కర్, ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలి



కడపలోని ప్రభుత్వ బాలుర గృహంలో భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్జి బాబా ఫకృద్దీన్, సిబ్బంది

కడప అర్బన్: పిల్లలు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ అన్నారు. బుధవారం జడ్జి తమ సిబ్బందితో కలిసి కడప నగరంలోని ప్రభుత్వ బాలుర గృహంను, హాస్టల్‌ను, తరగతి గదులను పరిశీలించారు. వసతి గదులను, వంటశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి .. బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం –2015 గురించి వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయశాఖ సిబ్బందికి శిక్షణ

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయసేవాసదన్‌లో ఐ ఆర్ ఏ డి/ ఈడిఏఆర్ ఎస్‌ఐసీ జిల్లా రోల్ అవుట్ మేనేజర్ సయ్యద్ ఖలీల్ చేతుల మీదుగా ×ఇ వివరణాత్మక ప్రమాద నివేదిక¥ అనే అంశంపై న్యాయశాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాలు, వాహనాల వివరాలు, ఆస్తి నష్టం, రవాణా, రోడ్డు వివరాలు, ఎనాలసిస్ ఆఫ్ డేటా మొదలైన అంశాలను వివరించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జునరెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కడప నగరం శ్రీనగర్ కాలనీకి చెందిన మల్లికార్జునరెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు కె. సురేష్ బాబు ఆయనకు నియామక పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్, యోగా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధికి పెద్దపీట

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమంతోపాటు అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు అన్నారు. బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక చిన్నచౌకు పాత బైపాస్ రోడ్డు వద్ద బీటీ రోడ్డు, కల్వర్టులకు వారు శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం, ఏ నాయకుడు చేయలేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రస్తుతం చిన్నచౌకు మద్రాస్ రోడ్డు పాత బై పాస్ రోడ్డు నుండి ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పుష్పగిరి స్కూల్ మీదుగా మాచుపల్లి రోడ్డుకు ఇంటర్ కనెక్షన్ రోడ్డును ఎన్క్యాప్, మున్సిపల్ సాధారణ నిధుల నుండి రూ.1.30 కోట్ల అంచనా వ్యయంతో బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎలాంటి నిధులు రాక అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. గత ప్రభుత్వం జిల్లాను కడప నగరాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో కడప నగరాభివృద్ధికి రూ.2 వేల కోట్ల నిధులు కేటాయించారన్నారు. అందులో భాగంగానే కడప నగరంలో అన్ని కూడళ్లను అభివృద్ధి చేసి, రోడ్ల విస్తరణ పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బండి ప్రసాద్, ఏ. బాలక్రిష్ణారెడ్డి, దాసరి శివప్రసాద్, సీహెచ్ వినోద్,షఫీ, డీఈ కరిముల్లాఖాన్ పాల్గొన్నారు.



బీటీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పొందిన లబ్ధిదారులతో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 12 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.18.66లక్షల చెక్కులను డిప్యూటీ సీఎం అంజద్ బాషా పంపిణీ చేశారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో కడప నగరానికి చెందిన సోమా నిర్మల, షేక్ రంతు బాషా, సయ్యద్ సుల్తాన బాను, ఏ. క్రిష్ణ పవన్, ఎం. రామయ్య, మహమ్మద్ ఇర్షద్ అలీ ఖాన్, జుటూర్ లక్ష్మీదేవి, సయ్యద్ నూరు బాషా, పి. సాజిదా ఖానమ్, ఏ.రత్న కుమారి, టక్కోలి లక్ష్మీ దేవి, సి. వసంతమ్మలకు ఈ చెక్కులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, చల్లా రాజశేఖర్, మగ్బూల్, జహీర్, షంషీర్, కె. బాబు, చెన్నయ్య, ఎస్. సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి



ప్రార్థనలలో పాల్గొన్న ముస్లింలు

కడప కల్చరల్ : పవిత్ర రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందు ప్రజల మధ్య సోదరభావం, మతసామరస్యాన్ని పరిమళింపజేస్తాయని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కడప నగరంలోని 7 రోడ్ల కూడలి మసీదులో రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా 2వ రోజున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ కార్యక్రమానికి అంజాద్ బాషా హాజరై దీక్షను విరమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పుణ్య కార్యమన్నారు. కడప నగరం మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు. పవిత్ర దైవారాధనకు, ధార్మిక చింతనకు, దైవభక్తికి క్రమశిక్షణకు, దాతృత్వానికి రంజాన్ మాసం ఆలవాలం అన్నారు. మనిషి సత్ప్రవర్తనలో నడవడానికి రంజాన్ ఉపవాసాలు ఉపకరిస్తాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండి రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని ప్రార్థనలు చేశామని చెప్పారు. అనంతరం అంజద్‌బాష సామూహిక నమాజు ప్రార్థనలు చేశారు.

కీర్తి ఎంటర్‌ప్రైజెస్ ప్రారంభం

కడప కార్పొరేషన్: నగరంలోని అక్కాయపల్లెలో సాయిబాబా స్కూల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన కీర్తి ఎంటర్‌ప్రైజెస్ హార్డ్‌వేర్ స్టోర్స్ ను వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రీజనల్ ఇన్‌చార్జి డా. వారణాసి ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో శివకుమార్, బంధు మిత్రులు పాల్గొన్నారు.



స్టోర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ వారణాసి ప్రతాప్‌రెడ్డి

వైవీయూ సాంస్కృతిక సమన్వయకర్తగా విజయభారతి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం సామాజిక, సాంస్కృతిక, సహ–పాఠ్య కార్యక్రమాల సెల్ నూతన కమిటీని ఏర్పాటు చేస్తూ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సెల్ సమన్వయకర్తగా వాణిజ్య శాస్త్ర శాఖ ఆచార్యులు జి. విజయభారతి నియమిస్తూ ఉత్తర్వులను వీసీ తన చాంబర్లో అందజేశారు. సభ్యులుగా జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్ సహ ఆచార్యులు డాక్టర్ ఎ.ముని కుమారి, జంతుశాస్త్రశాఖ సహ ఆచార్యులు డాక్టర్ ఎస్.పి. వెంకటరమణ, ఫైన్‌ఆర్ట్స్ విభాగం సహ ఆచార్యులు డాక్టర్ కె. మృత్యుంజయరావు, ఎకనామిక్స్ సహాయ ఆచార్యులు డాక్టర్ ఎన్. గణేష్ నాయక్‌లను నియమించారు.

కాలువ పనులు వెంటనే పూర్తి చేయాలి



అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్

కడప కార్పొరేషన్: కడప నగరంలో వరదనీరు సాఫీగా ప్రవహించడానికి ఏర్పాటు చేస్తున్న కాలువలను వెంటనే పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం గురుకుల విద్యాపీఠ్, జిల్లా కోర్టు, ప్రకాష్ నగర్, ఎస్‌బీఐ కాలనీల్లో జరుగుతున్న వరదనీటి కాలువల నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. రహదారిని తవ్వకుండా పనులు చేసేందుకు ప్రయత్నించాలన్నారు. పోలింగ్ స్టేషన్ సమీపంలో జరుగుతున్న పనులను వెంటనే పూర్తి చేయాల న్నారు. కాలువ గోడలకు సక్రమంగా క్యూరింగ్ చేయాలన్నారు. పనులు పూర్తయిన తర్వాత వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక, ఆర్అండ్‌బి ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

విల్లాస్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

కడప కార్పొరేషన్: కడప ఎర్రముక్కపల్లి సమీపంలో అక్రమాలకు పాల్పడిన ఐకాన్ విల్లాస్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య కోరారు. ఈ మేరకు సీఎంకు ఆయన లేఖ రాశారు. రాజాసింగ్ అనే వ్యక్తి ఐకాన్ విల్లాస్ పేరుతో ప్రైవేటు, ప్రభుత్వ స్థలాలను, బావిని ఆక్రమించారని ఆరోపించారు. ఆహ్లాదకర పార్కులతో అందమైన భవనాలు నిర్మించి ఇస్తామని ప్రజలను మభ్యపెట్టి కొనుగోలు చేయించారన్నారు. కొనుగోలుదారులు 90 శాతం డబ్బులు చెల్లించినా ఇంకా నిర్మాణాలు పూర్తి చేయకుండా వారిని ఇబ్బంది పెడుతున్నారన్నారు.

వేడుకగా గ్రాడ్యుయేషన్ డే



గోల్డ్‌మెడల్స్, పట్టాలు అందుకుంటున్న విద్యార్థినులు



ప్రతిజ్ఞ చేస్తున్న డిగ్రీ పట్టాలు పొందిన విద్యార్థినులు

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్ కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) 2వ గ్రాడ్యుయేషన్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నిర్వహించిన ఈ వేడుకలకు అతిథులుగా విచ్చేసిన వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్, వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యలకు కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్ నుంచి గౌరవ వందనం లభించింది. ముఖ్యఅతిథి వైవీ యూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థిదశ ఎంతో కీలకమైనదన్నారు. హార్డ్‌వర్క్‌కు ప్రత్యామ్నాయం లేదని సూచించారు. గౌరవ అతిథి డాక్టర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు కంఫర్ట్‌జోన్ విడిచి కొత్త ప్రాంతాలు, కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి గురించి వివరించారు. అనంతరం వైస్ చాన్సలర్ పట్టాలు పొందిన విద్యార్థులందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం 2018–21 విద్యాసంవత్సరం, 2019–22 విద్యాసంవత్సరాల్లో డిగ్రీ పూర్తి చేసుకున్న 316 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. వివిధ సబ్జెక్టుల్లో ప్రథములుగా నిలిచిన 30 మంది ప్రతిభావంతులకు గోల్డ్‌మెడల్స్‌ను అతిథుల చేతుల మీదుగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ఆచార్య ఎం.వి. శంకర్, కడప ఆర్‌జేడీ డా. పి. బాబు, అనంతపురం ఆర్‌జేడీ డా. నాగలింగారెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్, యర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. రవికుమార్, కళాశాల విద్య అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డా. సి.హెచ్.తులసిమస్తానమ్మ, కళాశాల పాలకమండలి సభ్యులు తుమ్మలకుంట శివశంకర్ పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లపై జాతీయ సదస్సు నిర్వహిస్తాం

– వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్



అష్టావధాని లోకా జగన్నాథశాస్త్రిని సన్మానిస్తున్న వీసీ ఆచార్య సుధాకర్

వైవీయూ: మహా కవయిత్రి మొల్లమాంబపై జాతీయ సదస్సును వైవీయూలో నిర్వహించనున్నట్లు వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం వైవీయూలోని కవయిత్రి మొల్ల సమావేశం మందిరంలో మొల్ల జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మొల్ల రామాయణంపై పరిశోధక విద్యార్థులు పరిశోధనలు చేసేందుకు కూడా అనుమతి ఇస్తామన్నారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జి.పార్వతి, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ఆచార్య తప్పెట రామ్ ప్రసాద్ రెడ్డి , మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, రాయచోటికి చెందిన అష్టావధాని లోకా జగన్నాథశాస్త్రి మాట్లాడారు. అనంతరం అష్టావధాని లోకా జగన్నాథశాస్త్రిని మొల్ల సాహితీ సేవా పురస్కారంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ ఆచార్యులు ఆచార్య ఈశ్వర రెడ్డి, ఆచార్య రమాదేవి, ఆచార్య వినోదిని తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక నాటక పితామహుడు కోలాచలం

కడప కల్చరల్ : తెలుగు చారిత్రక నాటకాల వైభవాన్ని చాటిచెప్పిన కోలాచలం శ్రీనివాసరావు అద్వితీయమైన నాటకరంగ ప్రముఖుడని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి అన్నారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బుధవారం కోలాచలం 171వ జయంతిని నిర్వహించారు. కోలాచలం చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి తదితరులు మాట్లాడారు.

– కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో కోలాచలం శ్రీనివాసరావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కోలాచలం 30 నాటకాలు రాశారని, ఆయన రచించిన రామరాజు చరిత్ర నాటకంలో పఠాన్ పాత్రతోనే బళ్లారి రాఘవకు గొప్ప కీర్తి ప్రతిష్ఠలు లభించాయని గుర్తు చేశారు. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వర చారి మాట్లాడారు. ఈ సందర్భంగా రంగస్థల నటుడు ప్రకాశంను సత్కరించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగ కమిటీల ఎంపిక

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లా ఎస్సీ, బీసీ, మైనార్టీ, విద్యార్థి విభాగ కమిటీలను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలు..

ఎస్సీ విభాగం : జిల్లా అధ్యక్షులుగా చెప్పలి వినోద్‌కుమార్ (కడప), ప్రధాన కార్యదర్శులుగా బక్కా నాగరాజు (కడప), డి.డేనియల్ బాబు (పులివెందుల), డేవిక్ (జమ్మలమడుగు), రవికుమార్ (మైదుకూరు), పి.భాస్కర్ (కమలాపురం), కె.బాబు (బద్వేలు), సెక్రటరీలుగా ఎస్.డేవిడ్, ఎ.నాగేంద్ర (కడప), చంటి (ప్రొద్దుటూరు), ఎస్.రాజ, పి.హరిప్రసాద్, యోహాన్ (పులివెందుల), సింగరయ్య, రవిప్రకాశ్ (జమ్మలమడుగు), శ్రీ కాంత్ (మైదుకూరు) సుబ్బన్న, పి.భాస్కర్, కరుణాకరన్ (కమలాపురం), జి.ప్రతాప్ (బద్వేలు)తోపాటు మరో 20 మందిని జాయింట్ సెక్రటరీలుగా నియమించారు.

బీసీ విభాగం : జిల్లా అధ్యక్షులుగా బంగారు నాగయ్య యాదవ్ (కడప), ఉపాధ్యక్షులుగా జి.మధుసూదన్‌రావు (కడప), ప్రధాన కార్యదర్శులుగా డి.గుర్రయ్య (బద్వేలు), వెంకట రమణ (కడప), టి.నిత్యపూజయ్య (కమలాపురం), రమణయ్య (మైదుకూరు), టి.బాలయ్య, వై.నాగేశ్వర్, వి.సూర్యనారాయణ (జమ్మలమడుగు), శేషయ్య గౌడ్, మాధవ ఆచారి, కొండయ్య, చంద్రమౌళి (పులివెందుల)బి.నాగరాజు (ప్రొద్దుటూరు)తోపాటు 16 మంది సెక్రటరీలుగా, 16 మంది జాయింట్ సెక్రటరీలుగా, 22 మంది సభ్యులుగా నియమించారు.

మైనార్టీ విభాగం : జిల్లా అధ్యక్షులుగా సయ్యద్ చాంద్‌బాష (కడప), ఉపాధ్యక్షులుగా సయ్యద్ ఇస్మాయిల్‌బాష, షేక్ మౌలాన బాష (కడప), ప్రధాన కార్యదర్శులుగా మహబూబ్‌బాష (బద్వేలు), షేక్షావలీ (కమలాపురం), ఫయాజ్‌బాష (జమ్మలమడుగు), ఖలందర్ (పులివెందుల), సయ్యద్ జమాల్ (ప్రొద్దుటూరు), అతావుల్లా (మైదుకూరు), సయ్యద్ న్యామతుల్లా (కడప)తోపాటు 14 మంది సెక్రటరీలుగా, 18 మంది జాయింట్ సెక్రటరీలుగా, ఐదుగురు సభ్యులను నియమించారు.

విద్యార్థి విభాగం : జిల్లా అధ్యక్షులుగా టి.గురుసాయి దత్త (కడప), ఉపాధ్యక్షులుగా సాయి నారాయణరెడ్డి (బద్వేలు), శ్రీకాంత్‌రెడ్డి (జమ్మలమడుగు), ప్రధాన కార్యదర్శులుగా వి.కార్తీక్, టి.శివగంగాధర్‌రెడ్డి (కడప), రాజకుళ్లాయప్ప (పులివెందుల), సాయికుమార్‌రెడ్డి (కమలాపురం), కార్యదర్శులుగా జయాకర్, షేక్ అబ్దుల్ ఖాదర్ (జమ్మలమడుగు), ప్రవీణ్, పి.ధీరజ్ గణేష్ (కడప), రుద్రసేనారెడ్డి (జమ్మలమడుగు), కోశాధికారిగా వై.రాఘవేంద్రారెడ్డి (పులివెందుల)తోపాటు 18 మంది సభ్యులను నియమించారు.